సాక్షి కామారెడ్డి

గురువారం। 9। నవంబర్। 2023



నిర్భయంగా పనిచేయాలి

ఎలక్షన్ కోడ్‌ను పకడ్బందీగా అమలు చేయడానికి నిర్భయంగా పనిచేయాలని కలెక్టర్ పాటిల్ అధికారులకు సూచించారు.

- IIలో ▸



సృజనాత్మక విద్యనందించాలి

విద్యార్థులకు సృజనాత్మకతతో విద్యనందించాలని జిల్లా విద్యాశాఖాధికారి రాజు ఉపాధ్యాయులకు సూచించారు.

- IIIలో ▸

గరిష్టం/కనిష్టం
33.9 /20.7

వాతావరణం

ఉదయం ఆహ్లాదకరంగా ఉంటుంది. ఆకాశం మేఘావృతమవుతుంది. అక్కడక్కడ వర్షం కురిసే అవకాశాలున్నాయి.

నేడు గులాబీ దళపతి రాక



కామారెడ్డి నియోజకవర్గంనుంచి అసెంబ్లీ ఎన్నికల బరిలో నిలుస్తున్న బీఆర్ఎస్ అధినేత కేసీఆర్.. గురువారం నామినేషన్ వేయనున్నారు. అనంతరం పట్టణంలోని డిగ్రీ కళాశాల మైదానంలో నిర్వహించే సభలో ఆయన పాల్గొంటారు. ఈ సందర్భంగా సభకు భారీగా జనాన్ని సమీకరించేందుకు పార్టీ నేతలు కసరత్తు చేస్తున్నారు.

సభా ప్రాంగణం వద్ద ఏర్పాట్లు

- కామారెడ్డిలో నామినేషన్ వేయనున్న కేసీఆర్
- అనంతరం డిగ్రీ కళాశాల మైదానంలో బహిరంగ సభలో ప్రసంగించనున్న సీఎం
- భారీ జన సమీకరణపై దృష్టి సారించిన బీఆర్ఎస్ నేతలు

సాక్షి, కామారెడ్డి: గులాబీ దళపతి, సీఎం కేసీఆర్ కామారెడ్డి నుంచి పోటీ చేస్తుండడంతో ఈ ఎన్నికను బీఆర్ఎస్ ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. ఆయనను భారీ మెజారిటీతో గెలిపించడం కోసం మంత్రి కేటీఆర్ ఆధ్వర్యంలో నేతలు ప్రయత్నాలు చేస్తున్నారు. పార్టీ కామారెడ్డి ఎన్నికల ఇన్‌చార్జీగా వ్యవహరిస్తున్న కేటీఆర్.. ఇప్పటికే పలు సభల్లో పాల్గొని కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. కేసీఆర్ నామినేషన్ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ప్రజలు ఇంటికొకరు చొప్పున తరలిరావాలని కోరారు. ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ ఆధ్వర్యంలో భారీ జన సమీకరణకు ఏర్పాట్లు చేశారు. ప్రతి వార్డు, గ్రామం నుంచి జనాన్ని తరలించేలా ప్లాన్ చేశారు.

ఇంజినీరింగ్ విద్యకు ఇబ్బందులు...

జిల్లాలో ఒక్క ఇంజినీరింగ్ కాలేజీ కూడా లేదు. దీంతో ఉన్నత విద్య కోసం విద్యార్థులు ఇతర పట్టణాలకు వెళ్లాల్సి వస్తోంది. కామారెడ్డిలో జేఎన్‌టీయూ కాలేజీ ఏర్పాటుకు అప్పట్లో కొంత ప్రయత్నాలు జరిగినా.. కార్యరూపం దాల్చలేదు. దీనిపై కేసీఆర్ ఎన్నికల హామీ ఇస్తారని విద్యార్థిలోకం ఆశిస్తోంది.

రాష్ట్రంలో ఏకైక డెయిరీ కాలేజీ కామారెడ్డిలో ఉంది. అయితే పీజీ కోర్సులు లేకపోవడతో ఇతర రాష్ట్రాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఉంది. స్థానికంగా కాలేజీకి అరవై ఎకరాల స్థలం కేటాయించడంతో కాలేజీకి, హాస్టల్‌కు సరిపడా భవనాలున్నాయి. ఇక్కడ పీజీ కోర్సులు కేటాయించాల్సిన అవసరం ఉంది. అలాగే కామారెడ్డి డిగ్రీ కాలేజీలో ఫిషరీస్, ఫారెస్ట్రీ వంటి ప్రత్యేక కోర్సులున్నాయి. కళాశాలలో వాటికి సంబంధించిన పీజీ కోర్సులు ప్రవేశపెడితే ఈ ప్రాంత విద్యార్థులకు మేలు జరుగుతుంది. జిల్లాలో మహిళా డిగ్రీ కాలేజీ, దోమకొండలో డిగ్రీ కాలేజీ ఏర్పాటు అంశాలు కూడా ఏళ్లుగా పెండింగ్ లోనే ఉన్నాయి. మెడికల్ కాలేజీకి అనుబంధంగా నర్సింగ్ కాలేజీ, ఫార్మసీ కాలేజీ, ల్యాబ్‌టెక్నిషియన్ వంటి కోర్సులకు సంబంధించిన కాలేజీలు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. తెలంగాణ యూనివర్సిటీ సౌత్ క్యాంపస్‌లో మరిన్ని కోర్సులు ప్రవేశపెట్టి యూనివర్సిటీగా తీర్చిదిద్దాలని విద్యార్థులు కోరుతున్నారు.

వ్యవసాయ ఆధారిత పరిశ్రమలపై..

కామారెడ్డి నియోజకవర్గంలో వ్యవసాయమే ప్రధాన జీవనాధారం. ఇక్కడ మక్క, పత్తి, వరి, సోయా వంటి పంటలు పండిస్తారు. రైతులు వాటిని అమ్ముకునేందుకు నానా ఇబ్బందులు పడుతున్నారు. వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. పరిశ్రమలు ఏర్పాటు చేయడం ద్వారా ఈ ప్రాంత యువతకు ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయి. రైతులకు మేలు జరుగుతుంది. ఆ దిశగా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

కాళేశ్వరంపై ఏం చెబుతారో..

ముఖ్యమంత్రి కేసీఆర్ కామారెడ్డి నుంచి పోటీ చేస్తుండడంతో నియోజకవర్గ అభివృద్ధికి ఆయన హామీలిస్తారని ప్రజలు భావిస్తున్నారు. నియోజకవర్గంలో సాగునీటి కష్టాలు తీర్చేందుకు అప్పట్లో దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రాణహిత–చేవెళ్ల పథకానికి కామారెడ్డిలోనే శ్రీకారం చుట్టారు. 22వ ప్యాకేజీ కింద పనులు చేపట్టారు. అయితే ఆయన మరణానంతరం ప్రాజెక్టు పనులకు ఆటంకం కలిగింది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ప్రాజెక్టు రీడిజైన్‌లో భాగంగా ఆయకట్టు విస్తీర్ణం పెరిగినా, అందుకు అనుగుణంగా నిధులు మంజూరు కాకపోవడంతో పనుల్లో పురోగతి లేదు. ఇప్పటికీ పూర్తి స్థాయిలో భూసేకరణ జరగకపోవడం రైతులను నిరాశకు గురిచేసింది. సీఎం కేసీఆర్ పోటీ చేస్తున్న నేపథ్యంలో రైతుల్లో ఆశలు పెరిగాయి. ఎన్నికల ప్రచార సభ ద్వారా సీఎం కేసీఆర్ కాళేశ్వరం ప్యాకేజీపై కీలక ప్రకటన చేస్తారని ఆశిస్తున్నారు. అలాగే భీమేశ్వర ప్రాజెక్టుపైనా సీఎం ప్రకటన చేయవచ్చని భావిస్తున్నారు.



న్యూస్‌రీల్

'రేవంత్‌రెడ్డి సభను విజయవంతం చేయండి'



కామారెడ్డి టౌన్: జిల్లా కేంద్రంలో శుక్రవారం నిర్వహించే పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి బహిరంగ సభను విజయవంతం చేయాలని మాజీ మంత్రి షబ్బీర్ అలీ కోరారు. బుధవారం రేవంత్‌రెడ్డి తరఫున నామినేషన్ వేసిన అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. బీఆర్ఎస్ పాలనలో నియోజకవర్గంలో ఎలాంటి అభివృద్ధి జరగలేదన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. కొడంగల్‌లోకన్నా కామారెడ్డిలో రేవంత్‌రెడ్డికి ఎక్కువ మెజారిటీ ఇవ్వాలని ఓటర్లను కోరారు. రేవంత్‌రెడ్డి సీఎం అవుతారని, కామారెడ్డిని అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ అరికెల నర్సారెడ్డి, డీసీసీ అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్‌రావు, పట్టణ అధ్యక్షుడు పండ్ల రాజు, పార్టీ నాయకులు ఐరేని సందీప్, గుడుగుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

'సైనికుల్లా శ్రమిస్తే విజయం మనదే'



భిక్కనూరు: ప్రతి కాంగ్రెస్ కార్యకర్త సైనికుడి వలె శ్రమిస్తే ఎన్నికల్లో విజయం సాధించడం తథ్యమని ఆ పార్టీ మహిళా విభాగం రాష్ట్ర మాజీ అధ్యక్షురాలు శారద పేర్కొన్నారు. బుధవారం భిక్కనూరులో నిర్వహించిన భిక్కనూరు, రాజంపేట మండలాల కాంగ్రెస్ కార్యకర్తల సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రతి కార్యకర్త ఓటర్లను కలిసి, పదేళ్లలో బీఆర్ఎస్ సారథ్యంలోని రాష్ట్ర ప్రభుత్వం చేసిన అవినీతి, అక్రమాలను వివరించి, ఓట్లు అభ్యర్థించాలన్నారు. సమావేశంలో డీసీసీబీ మాజీ చైర్మన్ ఎడ్ల రాజిరెడ్డి, పీసీసీ కార్యదర్శి ఇంద్రకరణ్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు చంద్రకాంత్‌రెడ్డి, నాయకులు బల్యాల సుదర్శన్, భీంరెడ్డి, యాదవరెడ్డి, బల్యాల రేఖ, సుధాకర్‌రెడ్డి, కుంట లింగారెడ్డి, దయాకర్‌రెడ్డి, దుంపల మోహన్‌రెడ్డి, కర్నాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

'కాంగ్రెస్‌ను వీడే ప్రసక్తే లేదు'



నిజాంసాగర్: సుదీర్ఘ రాజకీయ అనుభవం కలిగిన తాను కాంగ్రెస్‌ను వీడే ప్రసక్తే లేదని జుక్కల్ మాజీ ఎమ్మెల్యే సౌదాగర్ గంగారాం పేర్కొన్నారు. బుధవారం పెద్దకొడప్‌గల్‌లోని తన నివాసంలో ఆయన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జుక్కల్‌లో కాంగ్రెస్ టికెట్టుపై గెలిచి నాలుగు సార్లు ఎమ్మెల్యేనయ్యానన్నారు. ఈసారి పార్టీ తనకు టికెట్టు ఇవ్వకపోయినా రెబల్‌గా బరిలో ఉంటానని స్పష్టం చేశారు. సమావేశంలో నియోజకవర్గంలోని కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు ఆర్మూర్‌కు కేటీఆర్

ఆర్మూర్: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ గురువారం ఆర్మూర్‌కు రానున్నారు. ఆయన బీఆర్ఎస్ ఆర్మూర్ అభ్యర్థి జీవన్‌రెడ్డి నామినేషన్ కార్యక్రమంలో పాల్గొంటారని పార్టీ నాయకులు తెలిపారు.

క్రియాశీల రాజకీయాల్లోకి తిమ్మయ్యగారి సుభాష్‌రెడ్డి

- నేడు సీఎం సమక్షంలో బీఆర్ఎస్‌లోకి..



సుభాష్‌రెడ్డి

సాక్షి, కామారెడ్డి: సామాజిక సేవా కార్యక్రమాలతో గుర్తింపు పొందిన ప్రముఖ బిల్డర్ తిమ్మయ్యగారి సుభాష్‌రెడ్డి క్రియాశీల రాజకీయాల్లోకి ప్రవేశిస్తున్నారు. ఆయన గురువారం సీఎం కేసీఆర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరనున్నారు.

బీబీపేట మండలం జనగామ గ్రామానికి చెందిన సుభాష్‌రెడ్డి బిల్డర్‌గా ఉన్నతంగా ఎదిగారు. ఆయన చాలా ఏళ్లుగా ఎన్నో రకాల సేవలు అందిస్తున్నారు. సొంత డబ్బులు రూ.6 కోట్లతో బీబీపేటలో ఆధునిక హంగులతో జెడ్పీ హైస్కూల్ భవనాన్ని నిర్మించి, అందరి దృష్టిని ఆకర్షించారు. అలాగే పలువురు పేదలకు ఇళ్లు నిర్మించి ఇచ్చారు. ఆయనకు బీబీపేట, దోమకొండ, భిక్కనూరు మండలాల్లో ఆయనకు పట్టుంది. మంత్రి కేటీఆర్‌తో సన్నిహిత సంబంధాలున్న సుభాష్‌రెడ్డి.. ప్రతి ఎన్నికల సమయంలో బీఆర్ఎస్ తరఫున పనిచేస్తున్నా పార్టీ కండువా మాత్రం కప్పుకోలేదు. ఇటీవల సీఎం కేసీఆర్ ఆహ్వానించడంతో ప్రగతిభవన్‌కు వెళ్లి కలిశారు. ఈ సందర్భంగా సీఎం ఆయనను క్రియాశీల రాజకీయాల్లోకి ఆహ్వానించినట్లు తెలిసింది. దీంతో ఆయన పార్టీ కండువా కప్పుకోవడానికి రెడీ అయ్యారు. గురువారం కామారెడ్డిలో జరిగే సీఎం బహిరంగ సభలో బీఆర్ఎస్‌లో చేరనున్నారు.

'సీఎం సభకు తరలిరావాలి'



కామారెడ్డి క్రైం: జిల్లాకేంద్రంలో గురువారం నిర్వహించే సీఎం సభను విజయవంతం చేయాలని ఎమ్మెల్సీ షేరి సుభాష్‌రెడ్డి ప్రజలను కోరారు. కామారెడ్డిలోని ప్రభుత్వ విప్ నివాసం వద్ద మాచారెడ్డి ఎంపీపీ నర్సింగరావు, జెడ్పీటీసీ మిన్కూరి రాంరెడ్డిల ఆధ్వర్యంలో బుధవారం మాచారెడ్డి మండలానికి చెందిన బీజేపీ కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా సుభాష్‌రెడ్డి మాట్లాడుతూ కామారెడ్డినుంచి స్వయంగా సీఎం కేసీఆర్ పోటీ చేస్తుండడంతో ఈ ప్రాంతానికి మేలు జరుగుతుందన్నారు. సీఎం రాకతో కామారెడ్డి రూపురేఖలు మారతాయని, అభివృద్ధి పథంలో మరింత ముందడుగు పడుతుందని పేర్కొన్నారు. సీఎం నామినేషన్ అనంతరం నిర్వహించే బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరారు.

బతుకులు బాగుపడే రోజులొచ్చాయి



కాంగ్రెస్ శ్రేణులతో ర్యాలీగా నామినేషన్ కేంద్రానికి వెళ్తున్న మదన్‌మోహన్‌రావు

- కాంగ్రెస్ అభ్యర్థి మదన్‌మోహన్‌రావు
- ఎల్లారెడ్డిలో భారీ ర్యాలీ, నామినేషన్ దాఖలు



మాట్లాడుతున్న మదన్‌మోహన్‌రావు

నాగిరెడ్డిపేట: ఎల్లారెడ్డి నియోజకవర్గ ప్రజల బతుకులు బాగుపడే రోజులు వచ్చాయని కాంగ్రెస్ అభ్యర్థి మదన్‌మోహన్‌రావు పేర్కొన్నారు. బుధవారం ఆయన అట్టహాసంగా నామినేషన్ వేశారు. భారీగా తరలివచ్చిన కాంగ్రెస్ కార్యకర్తలతో పట్టణంలో ర్యాలీ తీశారు. పట్టణ శివారులోని కాంగ్రెస్ కార్యాలయం నుంచి రిటర్నింగ్ అధికారి కార్యాలయం వరకు ర్యాలీ కొనసాగింది. సుమారు గంటన్నర పాటు ర్యాలీ సాగింది. ఎన్నికల రిటర్నింగ్ అధికారి కార్యాలయానికి 100 మీటర్ల దూరంలో పోలీసులు ర్యాలీని నిలిపివేసి, నామినేషన్ కోసం అభ్యర్థి వెంట మరో నలుగురు వెళ్లడానికి అనుమతించారు. ఎల్లారెడ్డి మాజీ జెడ్పీటీసీ సభ్యుడు గయాజొద్దీన్, నాయకులు అరీఫ్‌తోపాటు మరో ఇద్దరితో కలిసి కాంగ్రెస్ అభ్యర్థి మదన్‌మోహన్‌రావు లోపలికి వెళ్లి రిటర్నింగ్ అధికారికి నామినేషన్ పత్రాలు అందించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ ఎన్నికలలో నియోజకవర్గ ప్రజలు బీఆర్ఎస్ కారు టైర్లను పంక్చర్ చేయనున్నారన్నారు. తాను నిస్వార్థంగా నియోజకవర్గ ప్రజలకు సేవ చేస్తానని, ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత ఒక్క రూపాయి మాత్రమే ఎమ్మెల్యే వేతనాన్ని స్వీకరించి, మిగిలిన డబ్బును నియోజకవర్గ అభివృద్ధికి ఖర్చు చేస్తానని పేర్కొన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో కాంగ్రెస్ గాలి వీస్తోందన్నారు. రాష్ట్రంలో రాబోయేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని పేర్కొన్నారు. తన నామినేషన్ ఘట్టానికి తరలివచ్చిన కార్యకర్తలను చూస్తుంటే చాలా ఆనందంగా ఉందన్నారు. కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు ఇదే ఉత్సాహంతో పనిచేయాలని కోరారు.

నామినేషన్ల జోరు



బాన్సువాడలో నామినేషన్ వేస్తున్న బీజేపీ అభ్యర్థి యెండల లక్ష్మీనారాయణ



కామారెడ్డిలో కేంద్ర మంత్రితో కలిసి నామినేషన్ వేస్తున్న బీజేపీ అభ్యర్థి వెంకటరమణారెడ్డి

కామారెడ్డి క్రైం: జిల్లాలో నామినేషన్ల పర్వం ఊపందుకుంది. బుధవారం 43 నామినేషన్లు దాఖలయ్యాయి. కామారెడ్డిలో 16, ఎల్లారెడ్డిలో 6, జుక్కల్‌లో 14, బాన్సువాడలో 7 నామినేషన్‌లు వచ్చాయని రిటర్నింగ్ అధికారులు తెలిపారు.

ఎల్లారెడ్డిలో 6..

ఎల్లారెడ్డి కాంగ్రెస్ అభ్యర్థి మదన్‌మోహన్‌రావు, బీఎస్పీ అభ్యర్థి జమునా రాథోడ్, ఆప్ నుంచి బామన్ అమర్ సింగ్, ధర్మ సమాజ్ పార్టీ నుంచి శంబగుల్ల లక్ష్మయ్య, ఇండిపెండెంట్‌లుగా మంజ్యా బంతీలాల్, బద్యా నాయక్ నామినేషన్‌లు వేశారు.

బాన్సువాడలో 7..

బాన్సువాడలో బీజేపీ అభ్యర్థి యెండల లక్ష్మీనారాయణ నామినేషన్ వేశారు. కాంగ్రెస్ నేత కాసుల బాల్‌రాజ్ తరఫున కార్యకర్తలు ఒక సెట్, కాసుల రోహిత్ మరో సెట్, ధర్మ సమాజ్ పార్టీనుంచి శ్రీకాంత్ తోట, స్వతంత్ర అభ్యర్థులుగా కునింటి రాము, దేమే సుభాష్, షేక్ గౌస్, గోపాల్ నామినేషన్లు దాఖలు చేశారు.

కోటగిరి మండలంలోని హంగర్గకు చెందిన దేమే సుభాష్‌కు కళ్లు కనిపించవు. ఆయన సరూర్‌నగర్‌లో అంధుల పాఠశాల నిర్వహిస్తున్నారు. అంధులు, దివ్యాంగుల హక్కుల సాధన కోసం ఎన్నికల బరిలో దిగినట్టు ఆయన తెలిపారు.

డబుల్ బెడ్ రూం ఇంటి బిల్లు రాకపోవడంతో ఎత్తొండకు చెందిన షేక్ గౌస్ సైకిల్‌కు పేలాల సంచి కట్టుకుని వచ్చి నామినేషన్ వేశారు.

కామారెడ్డిలో 16..

కామారెడ్డి నియోజకవర్గంలో బీజేపీ అభ్యర్థి వెంకటరమణారెడ్డి రెండు సెట్ల నామినేషన్లు వేశారు. ఆయన వెంట కేంద్ర మంత్రి పురుషోత్తం రూపాల ఉన్నారు. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి తరఫున మాజీ మంత్రి షబ్బీర్ అలీ నామినేషన్ దాఖలు చేశారు. బీఎస్పీ నుంచి ఉద్దావర్ సురేష్ గౌడ్, బహుజన లెఫ్ట్ ఫ్రంట్ నుంచి సిరిగాద సిద్ధిరాములు, రాజ్యాధికార పార్టీ నుంచి పంపరి నర్సింహా నరేందర్ రెండు సెట్లు, అలియన్స్ ఆఫ్ డెమోక్రటిక్ రీఫార్మ్ పార్టీ నుంచి లింగాల ముత్యం, ఇండిపెండెంట్‌లుగా బోదాసు నర్సింలు, ఎర్రోల్ల నరేష్, చిందం మల్లయ్య, నీల నాగరాజు, ఆకుల హరీష్, చెవుల పర్శరాములు, దొడ్లె రాజేందర్, బుట్టింగారి మాధవరెడ్డి నామినేషన్లు వేశారు.

జుక్కల్‌లో 14..

జుక్కల్‌లో బీఆర్ఎస్ అభ్యర్థి హన్మంత్ సింధే తరఫున పార్టీ నాయకులు రెండు సెట్లు, ఆయన భార్య శోభావతి సింధే తరఫున మరో రెండు సెట్లు దాఖలు చేశారు. బీజేపీ అభ్యర్థి అరుణ తార మూడు సెట్లు దాఖలు చేయగా.. బహుజన్ భారత్ పార్టీ అభ్యర్థి ఆర్.బాబు, తెలంగాణ రాజ్య సమితి(టీఆర్ఎస్) అభ్యర్థి బోగడమీద సాయిలు, ధర్మ సమాజ్‌పార్టీ(డీఎస్‌పీ) అభ్యర్థి పానగంటివారి భూమయ్య, ఇండియా ప్రజా బంధు పార్టీ అభ్యర్థి రాజు, ఇండిపెండెంట్లుగా గంగారాం, ప్రేమ్‌కుమార్, గైక్వాడ్ ప్రకాశ్ నామినేషన్లు దాఖలు చేశారు. నామినేషన్ చివరి రోజైన శుక్రవారం బీఆర్ఎస్ అభ్యర్థి హన్మంత్ సింధే, కాంగ్రెస్ అభ్యర్థి తోట లక్ష్మీకాంతరావ్ నామినేషన్లు వేయనున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి.



ఎల్లారెడ్డిలో నామినేషన్ వేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి మదన్‌మోహన్‌రావు

తెలంగాణలో రానున్నది రామరాజ్యం


- కేసీఆర్‌ను ఓడించి చరిత్ర సృష్టిస్తాం
- కేంద్ర పశుసంవర్ధక శాఖ మంత్రి పురుషోత్తం రూపాలా



బీజేపీ జిల్లా కార్యాలయంలో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి పురుషోత్తం రూపాలా

కామారెడ్డి టౌన్: తెలంగాణలో రానున్నది బీజేపీ రామరాజ్యమేనని కేంద్ర మత్స్య, పశుసంవర్ధక శాఖల మంత్రి పురుషోత్తం రూపాలా పేర్కొన్నారు. బుధవారం బీజేపీ అభ్యర్థి వెంకటరమణారెడ్డి నామినేషన్ వేసిన అనంతరం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. సీఎం కేసీఆర్ కుటుంబ పాలనతో తెలంగాణను దోచుకున్నాడని ఆరోపించారు. కామారెడ్డిలో సీఎం కేసీఆర్‌ను చిత్తుగా ఓడించేది బీజేపీయేనన్నారు. గజ్వేల్‌లో ఒక్క ఈటల రాజేందర్‌ను చూసి ఓటమి భయంతో కేసీఆర్ కామారెడ్డికి వచ్చాడని, ఇక్కడ ఇంటింటా వెంకటరమణారెడ్డిలే ఉన్నారని ఆయనకు తెలియడం లేదని పేర్కొన్నారు. రైతు సంక్షేమం కోసం బీజేపీ ఆలోచిస్తోందని, భూములు కబ్జా చేయాలని బీఆర్ఎస్ చూస్తోందని ఆరోపించారు. కామారెడ్డిలో రాక్షస పాలన కావాలో.. ప్రజల్లో ఉండే రామరాజ్యం కావాలో ఓటర్లు తేల్చుకోవాలన్నారు. మంత్రులకు, ఎమ్మెల్యేలకు సమయం ఇవ్వని కేసీఆర్.. ఇక్కడి ప్రజలకు అందుబాటులో ఎలా ఉంటాడని ప్రశ్నించారు. ఓడిపోతానని ముందే తెలిసి నియోజకవర్గంలో 50 మంది ఓటర్లకు ఒక నాయకుడిని ఇన్‌చార్జీగా సీఎం పెట్టుకున్నాడని విమర్శించారు. ఓటుకొక్క ఇన్‌చార్జీని పెట్టుకున్నా పర్వాలేదని, ఓటర్లు బీజేపీవైపే ఉన్నారని పేర్కొన్నారు. ఒకేసారి ముఖ్యమంత్రిని, పీసీసీ అధ్యక్షుడిని ఓడించే అవకాశం కామారెడ్డి ప్రజలకు వచ్చిందన్నారు. ఇక్కడ సీఎంను ఓడించి చరిత్రలో నిలుస్తామన్నారు. తెలంగాణలో బీసీనే ముఖ్యమంత్రిని చేస్తామని, ప్రజలు అండగా ఉండాలని కోరారు. సమావేశంలో అక్కల్‌కోట్ ఎమ్మెల్యే సచిన్ కల్యాణ్ శెట్టి, నాయకులు మురళీధర్‌గౌడ్, మైపాల్‌రెడ్డి, నీలం చిన్నరాజులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

అకాల వర్షంతో ఆగమాగం



ధాన్యం బస్తాలలో నిలిచిన వర్షపు నీటిని తొలగిస్తున్న రైతులు



వరదనీటిలో కొట్టుకుపోయిన ధాన్యాన్ని ఎత్తుతున్న రైతులు

నాగిరెడ్డిపేట: జిల్లాలోని పలు ప్రాంతాలలో బుధవారం అకాల వర్షం కురిసింది. పంట నూర్పిడి అనంతరం కొనుగోలు కేంద్రాలకు తరలించి, ఆరబోసిన ధాన్యం భారీ వర్షానికి కొట్టుకుపోయింది. ధాన్యాన్ని కాపాడుకోవడానికి రైతులు నానా ఇబ్బందులు పడ్డారు.





నాగిరెడ్డిపేట కొనుగోలు కేంద్రంలో వరదనీటిలో కొట్టుకుపోయిన ధాన్యం

క్లుప్తంగా

ఎన్నికల బరిలో పెద్దాయన !



సాక్షి, కామారెడ్డి: ప్రజలకు ఉచిత విద్య, వైద్యం అందించాలని, పంటలకు గిట్టుబాటు ధరలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ జిల్లా కేంద్రంలోని దేవునిపల్లికి చెందిన చిందం మల్లయ్య ఏడు పదుల వయసులో ఎన్నికల బరిలో నిలిచారు. కామారెడ్డి అసెంబ్లీ స్థానానికి గురువారం ఆయన స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేశారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు లేవని, వడ్డీల భారం తగ్గించాలని పేర్కొన్నారు.

రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటుపై ప్రకటన చేయాలి



కామారెడ్డి టౌన్: కామారెడ్డిలో నిర్వహించే ప్రజా ఆశీర్వాద సభలో సీఎం కేసీఆర్ రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు ప్రకటన చేయాలని రెడ్డి ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు సంతోష్‌రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం ఆయన మాట్లాడారు. 2018 ఎన్నికల్లో రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటుకు సీఎం హామీ ఇచ్చారని, ఇప్పటికి అమలుకు నోచుకోలేదని గుర్తు చేశారు. కాంగ్రెస్, బీజేపీ కూడా వారి మేనిఫెస్టోలో ఈ అంశాన్ని చేర్చి ప్రకటించాలని డిమాండ్ చేశారు. కరుణాకర్‌రెడ్డి, రాజ్‌కుమార్, బాణాల మల్లారెడ్డి, మోహన్‌రెడ్డి తదితరులున్నారు.

15న స్పాట్ అడ్మిషన్

రుద్రూర్: మండలంలోని అక్బర్‌నగర్‌లో ఉన్న ఫుడ్ సైన్స్ టెక్నాలజీ కళాశాలలో విద్యార్థులు ప్రవేశం పొందేందుకు ఈ నెల 15న స్పాట్ అడ్మిషన్‌ను ఏర్పాటు చేసినట్లు కళాశాల అసోసియేట్ డీన్ కల్పన బుధవారం తెలిపారు. ఇంటర్ ఎంపీసీ, బైపీసీ విద్యార్థులు స్పాట్ అడ్మిషన్‌కు హాజరు కావచ్చని అన్నారు. ఈ నెల 15న హైదరాబాద్‌లోని రాజేంద్రనగర్‌లో స్పాట్ అడ్మిషన్ ఉంటుందని అర్హులైన విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు కళాశాల వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు.

సమస్యాత్మక కేంద్రాలపై నిఘా

- 239 పోలింగ్ కేంద్రాలు గుర్తింపు
- అప్రమత్తమైన యంత్రాంగం
- అదనపు బలగాల కేటాయింపు
- ప్రశాంతంగా పోలింగ్ జరిగేలా చర్యలు



కామారెడ్డి క్రైం: ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరగాలంటే పోలింగ్ మొదలుకొని పూర్తయ్యే వరకు అధికార యంత్రాంగం తగిన కృషి చేయాల్సిందే. ఎన్నికల విధుల్లో పోలీసుల పాత్ర కీలకం. భద్రతా పరమైన చర్యల్లో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా అప్రమత్తంగా ఉండాలి. జిల్లాలో గతంలో జరిగిన పొరపాట్లు, అల్లర్లు, ఇబ్బందికరమైన పరిస్థితులు పునరావృతం కాకుండా ఉండేందుకు యంత్రాంగం ముందుగానే అప్రమత్తమైంది. జిల్లా వ్యాప్తంగా మొత్తం 239 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు ఉన్నట్లు గుర్తించారు. ఆయా ప్రాంతాల్లో చేపట్టాల్సిన భద్రతా చర్యల్లో అధికారులు నిమగ్నమయ్యారు.

భద్రతా ఏర్పాట్లు..

సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద అదనపు బలగాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నారు. సాధారణ పోలింగ్ కేంద్రానికి ఎన్నికల సిబ్బందికి తోడు భద్రత కోసం ఒక కానిస్టేబుల్, ఒక హోంగార్డ్‌ను మాత్రమే కేటాయిస్తారు. కానీ సమస్యాత్మక పోలింగ్ కేంద్రానికి ఒక ఎస్సై, ఇద్దరు ఏఎస్సై లేదా హెడ్ కానిస్టేబుల్ స్థాయి అధికారులు, ఒక కానిస్టేబుల్, ముగ్గురు ఆర్మ్‌డ్ జవాన్‌లతో కలిసిన బృందాన్ని కేటాయిస్తారు. అంతేగాకుండా ప్రతి పోలింగ్ కేంద్రంలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయనున్నట్లు అధికారులు తెలిపారు. పోలింగ్ ప్రక్రియ మొత్తం వీడియో రికార్డు కానుంది. ఈ పద్ధతిలో నిరంతర పర్యవేక్షణ చేపట్టనున్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు జిల్లాలోని సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద సీసీ కెమెరాల బిగింపు ప్రక్రియ ప్రారంభం కానుంది. ప్రజల్లో భద్రతా భావాన్ని పెంపొందించే దిశగా జిల్లాకు 3 పారామిలటరీ బృందాలు వచ్చాయి. వీటికి అదనంగా మరో 4 కంపెనీలకు చెందిన మిలటరీ దళాలు వచ్చే అవకాశాలు ఉన్నాయి.

అవగాహన కార్యక్రమాలు..

సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల పరిధిలో ఓటింగ్ శాతాన్ని పెంచడంతో పాటు, ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకునేలా ప్రజలకు అవగాహన కల్పించేందుకు జిల్లా యంత్రాంగం స్వీప్ కార్యక్రమంలో భాగంగా అవగాహన కార్యక్రమాలను చేపడుతోంది. ఓటింగ్ విధానం, ఎన్నికల ప్రక్రియపై ఓటర్లకు నమ్మకం పెరిగేలా కళాబృందాల ద్వారా ప్రదర్శనలు, గ్రామసభలను నిర్వహిస్తున్నారు.

అదనంగా 51 కేంద్రాల గుర్తింపు

జిల్లాలో మొత్తం 239 పోలింగ్ కేంద్రాలను సమస్యాత్మకంగా అధికారులు గుర్తించారు. కామారెడ్డి నియోజకవర్గంలో 92, ఎల్లారెడ్డిలో 92, జుక్కల్‌లో 55 ఉన్నాయి. 2018లో 188 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు ఉండేవి. వాటికి అదనంగా 51 కేంద్రాలను జోడించారు. ఆయా కేంద్రాల వద్ద గత ఎన్నికల్లో జరిగిన అల్లర్లు, ఇబ్బందికర ఘటనలు, వివాదాలు, నక్సల్స్ ప్రభావిత ప్రాంతాలు, పలు అంశాల ఆధారంగానే కాకుండా ఒకే భవనంలో ఎక్కువ సంఖ్యలో పోలింగ్ కేంద్రాలుంటే ఓటర్ల రద్దీని ఎక్కువగా ఉండే అవకాశం ఉంటుంది. కాబట్టి అలాంటి పోలింగ్ కేంద్రాలను సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలుగా గుర్తిస్తారు. ఎన్నికల కోడ్ అమల్లోకి రాగానే సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల గుర్తింపు, వాటి వద్ద చేపట్టాల్సిన భద్రతా ఏర్పాట్లపై జిల్లా యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించింది.

'నిర్భయంగా విధులు నిర్వహించాలి'



మాట్లాడుతున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్

కామారెడ్డి క్రైం: ఎన్నికల నియమావళిని పకడ్బందీగా అమలు చేయడంలో అన్ని బృందాలు నిర్భయంగా పనిచేయాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ సూచించారు. కలెక్టరేట్‌లో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఎన్నికల్లో వ్యయ నియంత్రణను పర్యవేక్షించడమే అన్నిటికంటే పెద్ద సవాల్ అన్నారు. వ్యయ నిర్వహణ విధులపై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. అందుకు సంబంధించిన పలు అంశాలపై అవగాహన కల్పించారు. సెక్షన్ 171–బి ప్రకారం ఓటర్లను ప్రలోభాలకు గురి చేయడం, నగదు, మద్యం, తాయిలాల అక్రమ రవాణా నేరమన్నారు. తనిఖీలలో స్వాధీన పరచుకున్న నగదు, మద్యం తదితర వివరాలను సరైన ఆధారాలతో రికార్డు చేసి, పంచనామా నిర్వహించాలన్నారు. రాజకీయ పార్టీల ర్యాలీలు, సభలు, సమావేశాలకు సంబంధించి ముందస్తు అనుమతులు పొందేలా చూడాలన్నారు. సి–విజిల్, 1950 టోల్‌ఫ్రీ నంబర్లపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. పోలీస్, ఎక్సైజ్, ఎఫ్ఎస్‌టీ, ఎస్ఎస్‌టీ బృందాలు సమన్వయంతో పనిచేస్తూ రోజువారీ నివేదికలు సమర్పించాలని ఆదేశించారు. సమావేశంలో నోడల్ అధికారులు కిషన్, సురేందర్ కుమార్, సింహారావు, సంతోష్, సతీష్ యాదవ్, శాంతి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్ సారథ్యంలోనే జుక్కల్ అభివృద్ధి

బీఆర్ఎస్ అభ్యర్థి హన్మంత్ సింధే



నర్వలో ప్రసంగిస్తున్న హన్మంత్ సింధే

నిజాంసాగర్(జుక్కల్): సీఎం కేసీఆర్ సారథ్యంలో జుక్కల్ నియోజకవర్గం అన్నిరంగాల్లో అభివృద్ధి పథంలో దూసుకెళ్తోందని జుక్కల్ అసెంబ్లీ బీఆర్ఎస్ అభ్యర్థి హన్మంత్ సింధే అన్నారు. బుధవారం మహమ్మద్‌నగర్ మండలంలోని హసన్‌పల్లి, నర్వ, గున్కుల్, బూర్గుల్, తున్కిపల్లి గ్రామాల్లో ఎన్నికల ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 60 ఏళ్ల కాంగ్రెస్ పాలనలో వెనుకబాటుకు గురైన జుక్కల్ నియోజకవర్గం ప్రస్తుతం బీఆర్ఎస్ పాలనలో అభివృద్ధి పథాన నిలిచిందన్నారు. వైద్య పరంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు పరిమితమైన జుక్కల్ నియోజకవర్గానికి వంద పడకల ఆస్పత్రితో పాటు ముప్పై పడకల ఆస్పత్రులు, డయాలసిస్ కేంద్రాన్ని మంజూరు చేశామని చెప్పారు. కారు గుర్తుకు ఓటు వేసి గెలిపిస్తే నాల్గవ సారి ఎమ్మెల్యేను అవుతానని అన్నారు. జెడ్పీ మాజీ చైర్మన్ దఫేదార్ రాజు,సర్పంచులు గోర్గంటి సంగమణి, సవేరా బేగం, లింగాల వసంత, ఎంపీటీసీ పుప్పాల లచ్చవ్వ, బీఆర్ఎస్ నాయకులు దుర్గారెడ్డి, గంగారెడ్డి, సత్యనారాయణ, వాజిద్‌అలీ, నర్సింహారెడ్డి, మోహన్‌రెడ్డి, తదితరులున్నారు.

డాక్టర్ సంతోష్‌కుమార్‌కు డాక్టరేట్



సంతోష్‌కు డాక్టరేట్‌ను ప్రదానం చేస్తున్న గవర్నర్

లక్ష్మీకాపూల్: ఐడీబీఐ జనరల్ మేనేజర్ డాక్టర్ సంతోష్ కుమార్‌కు నల్గొండలోని మహాత్మా గాంధీ విశ్వ విద్యాలయం డాక్టరేట్ ప్రదానం చేసింది. తెలంగాణ రాష్ట్రంలో గృహ రుణాలపై చేసిన పరిశోధన పూర్తి చేసినందుకు వర్సిటీ చాన్స్‌లర్, గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ డాక్టరేట్‌ను ప్రదానం చేశారు. మహాత్మాగాంధీ యూనివర్సిటీ మూడో స్నాతకోత్సవంలో భాగంగా వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ గోపాల్‌రెడ్డి స్నాతకోత్సవ నివేదకను సమర్పించారు. ఈ సందర్భంగా వివిధ అంశాలపై పరిశోధన పూర్తి చేసిన పండితులకు గవర్నర్ డాక్టరేట్‌లను ప్రదానం చేశారు. సంతోష్ కుమార్ కామారెడ్డి జిల్లాకు చెందిన వారు.

గెస్ట్ లెక్చరర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

బాన్సువాడ రూరల్: మండలంలోని శ్రీరాం నారాయణ ఖేడియా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఖాళీగా ఉన్న పలు పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ డాక్టర్ గంగాధర్ తెలిపారు. కళాశాలలో ఇంగ్లిష్, కెమిస్ట్రీ సబ్జెక్టులు బోధించటానికి ఓబీసీలు పీజీలో 55 శాతం, ఎస్సీ, ఎస్టీలు 50 శాతం మార్కులతో పాసైనవారు అర్హులన్నారు. నెట్, సెట్ పాసైన వారికి ప్రాధాన్యత ఇస్తామన్నారు. 10లోపు కళాశాలలో దరఖాస్తులు సమర్పించాలని, ఈనెల 13న కామారెడ్డిలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తామన్నారు.

ఏసీబీ వలలో ఇన్‌చార్జి సబ్‌రిజిస్ట్రార్

- లంచం తీసుకుంటుండగా పట్టుకున్న అధికారులు
- నాలుగు గంటల పాటు కార్యాలయంలో సోదాలు



వివరాలు వెల్లడిస్తున్న ఏసీబీ డీఎస్పీ ఆనంద్‌కుమార్



అధికారులు స్వాధీనం చేసుకున్న నగదు

బాన్సువాడ: బాన్సువాడ ఇన్‌చార్జి సబ్‌రిజిస్ట్రార్ సతీశ్ లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు బుధవారం పట్టుపడ్డాడు. ఏసీబీ డీఎస్పీ ఆనంద్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. బాన్సువాడ పట్టణానికి చెందిన గాండ్ల రుక్మిణి ఇటీవల మృతిచెందడంతో ఆమె పేరుపై ఉన్న పాత ఇంటి స్థలాన్ని సేల్ డీడ్ చేసుకునేందుకు అక్టోబర్ 10న ఆమె ముగ్గురు కుమారులు గాండ్ల అంజయ్య, శ్రీనివాస్, ఉమమహేశ్ రిజిస్ట్రేషన్ కార్యాలయానికి వెళ్లారు. పాత ఇంటికి సంబంధించిన 200 గజాల స్థలాన్ని రిజిస్ట్రేషన్ చేసేందుకు ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్ సతీశ్ ఉమమహేశ్‌కు డబ్బులు డిమాండ్ చేయడంతో స్థానిక నాయకులను ఆశ్రయించాడు. దీంతో సదరు నాయకులు, దస్తావేఖర్లు ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్ వద్దకు వెళ్లి ఉమమహేశ్ బీఆర్ఎస్ నాయకుడని అతని వద్ద డబ్బులు తీసుకోవద్దని విన్నవించారు. రిజిస్ట్రేషన్ చేసిన సదరు అధికారి మోటేషన్ కోసం 15 రోజులుగా మహేశ్‌ను కార్యాలయం చుట్టూ తిప్పించుకున్నారు. ముగ్గురిపై రిజిస్ట్రేషన్ చేసినందున మోటేషన్‌కు రూ.15 వేలు ఇవ్వాలని ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్ డిమాండ్ చేశారు. దీంతో తాము అంత ఇవ్వలేమని మహేశ్ రూ.9 వేలు ఇచ్చేందుకు అంగీకరించాడు. మహేశ్ ఏసీబీ అధికారులను సంప్రదించడంతో ఉదయం కార్యాలయంలో విధులు నిర్వహించే యూసుఫ్‌కు ఏసీబీ అధికారులు అందించిన రూ.9 వేల నగదును మహేశ్ ఇస్తుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. డబ్బులు డిమాండ్ చేసిన ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్ సతీశ్, అటెండర్ యూసుఫ్‌పై కేసు నమోదు చేసినట్లు డీఎస్పీ తెలిపారు. దాడిలో ఏసీబీ సీఐలు శ్రీనివాస్, నగేశ్, వెంకటేశ్ తదితరులు ఉన్నారు.

అక్రమ నిర్మాణం కూల్చివేత

- అక్రమార్కులపై కేసు నమోదు



పిల్లర్లను కూల్చివేస్తున్న ఉద్యోగులు

నిజామాబాద్ సిటీ: ఆలయ భూమిని ఆక్రమించి కడుతున్న నిర్మాణాన్ని దేవాదాయ, ధర్మాదాయ శాఖ ఉద్యోగులు కూల్చివేశారు. అక్రమ కట్టడాన్ని కూల్చేందుకు జేసీబీ యంత్రాన్ని సిబ్బంది తీసుకురాగా ఓ ప్రజాప్రతినిధి అనుచరులు అడ్డుకుని వెనక్కి పంపా రు. దీంతో దేవాదాయ శాఖ ఉద్యోగులే రంగంలోకి దిగి అక్రమ కట్టడం పిల్లర్లను స్వయంగా కూల్చివేశారు. నగరంలోని వర్నిరోడ్డులో శ్రీ నీలకంఠేశ్వర ఆలయానికి చెందిన సుమారు 200 గజా ల ఖాళీ స్థలం ఉంది. ఇది 1953 నుంచి ఆలయ ఆధీనంలో ఉంది. ఖాళీగా ఉన్న స్థలంపై కబ్జాదారులపై కన్నుపడింది. దీంతో ద ర్జాగా నిర్మాణం చేపట్టారు. బేస్‌మిట్ లెవల్ పూర్తి చేసి పైకి పిల్లర్ల ను వేశారు. విషయం తెలుసుకున్న దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ ఎన్ సుప్రియ ఇన్‌స్పెక్టర్ కమల, ఈవోలు జి వేణు, శ్రీ రాం రవీందర్, ఉద్యోగులను అక్కడికి పంపారు. అక్రమ కట్టడా న్ని కూల్చివేసేందుకు జేసీబీని తీసుకురాగా పనులను మల్లారం మాజీ సర్పంచ్ రాజన్నతో పాటు పబ్బ యాదగిరి, పబ్బ విజయ్ అడ్డుకున్నట్లు ఈవో వేణు తెలిపారు. వీరితో పాటు ఓ ప్రజాప్రతినిధి అనుచరులు కూల్చివేత జరుగకుండా అడ్డుకుని జేసీబీని అక్కడి నుంచి పంపించివేశారు. చివరకు 5వ టౌన్ పోలీసుల బందోబస్తు మధ్య ఇన్‌స్పెక్టర్ కమల, తన ఉద్యోగులతో పాటు స్వయంగా రంగంలోకి దిగి పిల్లర్లను కూల్చివేశారు. అనంతరం ఆలయ భూమిలో అక్రమ కట్టడాన్ని కూల్చివేస్తుండగా అడ్డుకున్న యాదగిరి, విజయ్, రాజన్నలపై అసిస్టెంట్ కమిషనర్ ఆదేశాల మేరకు 5వ టౌన్ పీఎస్‌లో ఫిర్యాదు చేసినట్లు వేణు తెలిపారు. వీరిపై పోలీసులు కేసు నమోదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. ఆలయ భూమిని కబ్జా చేసి అక్రమ నిర్మాణం చేపట్టింది ఎవరో తెలియదని, వారిని గుర్తించి కేసు పెట్టనున్నట్లు ఈవో తెలిపారు. 1954 నుంచి ఈ భూమి ఆలయ ఆధీనంలో ఉండగా, 1983 నుంచి ఇది తమ ఆధీనంలో ఉందని కబ్జాదారులు చూపెడుతున్న డాక్యుమెంట్లు చెల్లవని ఈవో స్పష్టం చేశారు. ఈ ప్రాంతంలో ఆలయానికి సంబంధించి మరో ఆరు స్థలాలు ఉన్నాయని వీటికి ఫెన్సింగ్ ఏర్పాటు చేయనున్నట్లు ఈవో పేర్కొన్నారు.

నగరంలో శ్రీవారి రథం శోభాయాత్ర



నిజామాబాద్ సిటీ: కోటి హనుమాన్ చాలీసా పారాయణ మహాయజ్ఞం శ్రీవారి రథం శోభాయాత్ర బుధవారం నగరంలో పలు మార్గాల్లో కొనసాగింది. తిరుమల తిరుపతి దేవస్థానం, శ్రీ హనుమాన్ దీక్ష పీఠాధిపతి సంయుక్త ఆధ్వర్యంలో దుర్గాప్రసాద్ స్వామిజీ పర్యవేక్షణలో యాత్రను ఇందూరు హనుమాన్ దీక్ష గురుస్వామి నాగభూషణం ప్రారంభించారు. ప్రజల్లో భక్తి చైతన్యాన్ని పెంపొందించడానికి తిరుమల తిరుపతి దేవస్థానం కోటి హనుమాన్ చాలీసా మహాయజ్ఞాన్ని గత జనవరి 21న తిరుపతిలో చేపట్టినట్లు నాగభూషణం తెలిపారు. ఇందులో భాగంగా బుధవారం జిల్లా కేంద్రానికి చేరుకుందన్నారు. దేశాయ్ గంగాధర్, జనగామ చంద్రశేఖర్ శర్మ, పంచరెడ్డి రాజు పాల్గొన్నారు.

కేజీబీవీ తనిఖీ



మాక్లూర్: మండల కేంద్రంలోని కేజీబీవీని డీఈవో దుర్గాప్రసాద్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రిజిస్టర్‌లోని విద్యార్థుల హాజరు శాతాన్ని పరిశీలించారు. పదో తరగతి విద్యార్థుల కోసం పాఠశాల ప్రత్యేక అధికారిణి ప్రగతి, ఉపాధ్యాయ బృందం తయారు చేసిన బోధన విధానాన్ని పరిశీలించిన డీఈవో సంతృప్తి వ్యక్తం చేశారు. కళాశాల పనితీరుతో పాటు ప్రత్యేక ప్రణాళికను గమనించి చదువులో వెనుకబడి ఉన్న విద్యార్థులకోసం ప్రత్యేక కార్యచరణను సిద్ధం చేయాలని ఉపాధ్యాయ బృందాన్ని ఆదేశించారు. గతేడాది కంటే ఈసారి ఉత్తీర్ణత శాతం మరింత పెరగాలన్నారు. దోమల వల్ల జ్వరాలు వచ్చే అవకాశం ఉన్నందున తగు ఏర్పాట్లు చేయాలని సూచించారు. డీఈవో వెంట ప్రత్యేకాధికారి ప్రగతి, ఉపాధ్యాయులు ఉన్నారు.

క్రైం కార్నర్

పిడుగుపాటుకు ఆంబోతు మృతి

ఇందల్వాయి: మండలంలోని గోల్యా తండాలో పిడుగుపాటుకు ఓ ఆంబోతు బుధవారం మృతి చెందింది. తండాలో పీర్‌సింగ్‌కు చెందిన ఆంబోతు పొలంలో గడ్డి మేస్తుండగా పిడుగుపడినట్లు గ్రామస్తులు తెలిపారు. మృతి చెందిన ఆంబోతును ఎంపీపీ రమేశ్ నాయక్, రెవెన్యూ, వెటర్నరీ అధికారులు పరిశీలించారు. బాధితుడికి ప్రభుత్వం తరపున సహాయం అందేలా చూస్తామని ఎంపీపీ తెలిపారు.

తల్లీకొడుకులకు గాయాలు..

మద్నూర్: మండలంలోని కొడిచిరలో పిడుగు పడడంతో వ్యవసాయ పనులు చేసుకుంటున్న తల్లీకొడుకులు లక్ష్మీబాయి, నవీన్‌కు గాయాలైనట్లు గ్రామస్తులు బుధవారం తెలిపారు. పొలంలో మక్క సాగు చేస్తుండగా ఒక్కసారిగా వర్షం కురిసింది. దీంతో వారు సమీపంలోని చెట్టు వద్దకు వెళ్తుండగా ఉరుములతో చెట్టుపై పిడుగు పడింది. దీంతో చెట్టు సమీపంలో ఉన్న లక్ష్మీబాయి, నవీన్‌లు స్పృహ తప్పిపడిపోయారు. గమనించిన కూలీలు వారిని మద్నూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా వైద్యులు మెరుగైన చికిత్స నిమిత్తం నిజామాబాద్‌కు తరలించారు.

కుక్కల దాడిలో పలువురికి..

ఎల్లారెడ్డి: మండల కేంద్రంలో పిచ్చి కుక్క దాడిలో పలువురికి గాయాలైనట్లు స్థానికులు బుధవారం తెలిపారు. మదన్‌మోహన్ ర్యాలీ నిర్వహిస్తున్న సమయంలో రోడ్డుపై గుంపులు గుంపులుగా జనాలు ఉండడంతో కుక్క పలువురిని కరవడంతో గాయాలపాలైనట్లు పేర్కొన్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

వేల్పూర్: మండలంలోని వాగులో గుర్తు తెలియని మృతదేహం లభ్యమైనట్లు ఎస్సై వినయ్‌కుమార్ బుధవారం తెలిపారు. మృతుడి వయస్సు 30 ఏళ్ల వరకు ఉంటుందన్నారు. ఎవరైనా మృతుడిని గుర్తిస్తే 8712659862 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

సింగిల్ ఫేస్ మోటార్‌లో మంటలు

రుద్రూర్: మండల కేంద్రంలోని ఏడో వార్డులో ఉన్న జీపీ సింగిల్ ఫేస్ మోటర్‌లో బుధవారం అకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. దీంతో స్థానికులు ఆందోళనకు గురయ్యారు. వెంటనే సమీపంలో ఉన్నవారు నీరు పోసి మంటలను ఆర్పి వేసి విద్యుత్ సరాఫరాను నిలిపివేయించారు. అధికారులు స్పందించి మోటర్‌కు మరమ్మతులు చేపట్టి నీటి సరఫరాను యథావిధిగా కొనసాగించాలని స్థానికులు కోరారు.

అదృశ్యమైన వ్యక్తి ఆత్మహత్య



అశోక్(ఫైల్)

లింగంపేట: మండల కేంద్రానికి చెందిన కుంట అశోక్(39) రెండు రోజుల క్రితం అదృశ్యం కాగా ఉరేసుకొని మృతి చెందినట్లు ఏఎస్సై ప్రకాశ్ బుధవారం తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి.. అశోక్ రెండు రోజుల క్రితం ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. చుట్టుపక్కల వెతికినా ఫలితం లేకపోవడంతో భార్య స్వప్న పోలీసులకు ఫిర్యాదు చేశారు. బుధవారం గ్రామ శివారులోని అటవీ ప్రాంతంలో అశోక్ చెట్టుకు ఉరేసుకొని స్థానికులకు కనిపించడంతో పోలీసులకు సమాచారం అందించారు. ఏఎస్సై ఘటన స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. అశోక్‌కు వివాహమై 12 ఏళ్లు గడిచినా పిల్లలు కాకపోవడంతో మనస్థాపానికి గురై ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు పేర్కొన్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై తెలిపారు.

పీడీఎస్ బియ్యం నిల్వ చేసిన వారిపై కేసు నమోదు

ఖలీల్‌వాడి: పీడీఎస్ బియ్యం నిల్వ చేసిన వారిపై కేసు నమోదు చేసినట్లు ఏసీపీ కిరణ్‌కుమార్ బుధవారం తెలిపారు. ఈనెల 7న సీసీఐ సీఐ రమేశ్, ఎస్సై రవీందర్ సిబ్బంది కలిసి పీడీఎస్ గోదాంలో తనిఖీలు నిర్వహించారు. ఆరోటౌన్ పీఎస్ పరిధిలోని నిజాంకాలనీలోని ఓ గోడౌన్‌లో నిర్వాహకుడు హన్నాల ఖాసీంబేగ్‌ను పట్టుకొని విచారించినట్లు తెలిపారు. నిందితుడి నుంచి మారణ ఆయుధాలు, మోటార్ సైకిల్‌లు, ఫోర్‌వీలర్స్, ఒక ఆటో, 180 బ్యాగుల పీడీఎస్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. రౌడీ షీటర్ అలీఖాన్ అలియాస్ బర్సాద్ ఆమేర్ జైలుకి వెళ్లే ముందు నిందితుడు హన్నాలఖాసీం బేగ్‌కి మారణ ఆయుధాలను అప్పగించినట్లు తెలిపారు. హన్నాలఖాసీం బేగ్‌పై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.

అందరికీ న్యాయం కోసం..

- నేడు న్యాయసేవల దినోత్సవం
- జిల్లాలో గతేడాది 31,219 సివిల్, క్రిమినల్ కేసుల పరిష్కారం



జిల్లా జడ్జి సునీత కుంచాల

ఖలీల్‌వాడి: న్యాయానికి గొప్ప, పేద అన్న తేడాలేదు. ఏ పౌరుడు ఆర్థిక, మరే ఇతర కారణాల వల్ల న్యాయం పొందే అవకాశాలు కోల్పోరాదన్న ఉద్దేశంతో.. పౌరులకు ఉచిత న్యాయ సహాయం అందించాలని భారత అత్యున్నత న్యాయస్థానం భావించింది. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకంగా ఒక చట్టం రూపొందించింది. దీని ప్రకారం సుప్రీంకోర్టు 1987 నవంబర్ 9న న్యాయసేవా సంస్థను ఏర్పాటు చేసింది. గతేడాది ఈ సంస్థ ద్వారా లోక్ అదాలత్‌లలో 31, 219 సివిల్, క్రిమినల్ కేసులను రాజీపద్ధతిన పరిష్కరించారు. ట్రాన్స్‌జెండర్‌లకు సమాజంలో సముచిత స్థానం కల్పించడంతోపాటు జీవించడానికి వీలుగా ఈ సంస్థ తనవంతు ప్రయత్నాలు చేస్తోంది. అన్నదాతలకు అండగా అగ్రి లీగల్ ఎయిడ్ క్లినిక్‌లను ప్రారంభించింది. ఈ చట్టం రూపొంది నేటికి 36 ఏళ్లు అవుతోంది. న్యాయసేవా సంస్థ దినోత్సవం గురువారం ర్యాలీ నిర్వహించనున్నట్లు జడ్జి సునీత పేర్కొన్నారు. ఈ సందర్భంగా జిల్లా ప్రజలకు అందుతున్న న్యాయ సేవలపై జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్‌పర్సన్, ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జి సునీత కుంచాలతో 'సాక్షి' ముచ్చటించింది.

ప్రశ్న: న్యాయసేవల చట్టం ఏర్పాటు, ప్రాముఖ్యత ఏమిటి?

జవాబు: సుప్రీంకోర్టు పలు తీర్పుల్లో ఉచిత న్యాయవాద సహాయం ప్రాథమిక హక్కుగా నిర్ధారించింది. ఆర్టికల్ 39–ఎ సమాన న్యాయం, ఉచిత న్యాయ సహాయంలో పేర్కొన్న విధంగా న్యాయసేవల ప్రాధికారం చట్టం–1987ను రూపొందించి అమలు చేస్తున్నాం.

ప్రశ్న: న్యాయ సహాయం కొందరికా.. అందరికా?

జవాబు: ఆర్థికంగా వెనుకబడిన అన్ని వర్గాల ప్రజా సమూహాలకు ఉచిత న్యాయసహాయం అందిస్తున్నాం.

■ క్రిమినల్ నేరాల్లో బాధితులను ఎలా గుర్తిస్తారు, పరిహారం ఎలా అందిస్తారు?

■ నేరాలు చాలా రకాలు ఉంటాయి. కానీ ప్రాధాన్యత దృష్ట్యా పోక్సో కేసుల్లో బాధితులైన బాలికలకు నేర తీవ్రతను గుర్తించి ఆ మేరకు ఆర్థిక పరిహారం అందిస్తున్నాం. హత్య కేసుల్లో తల్లిదండ్రులను కోల్పోయిన వారికి సంస్థ తగిన ఆర్థిక పరిహారం చెల్లిస్తుంది.

■ రోడ్డు ప్రమాద బాధితులకు నష్టపరిహారం ఎలా అందుతోంది?

■ సంవత్సర కాలంలో జాతీయ లోక్ అదాలత్ ద్వారా బీమా కంపెనీ, బాధిత వర్గాలతో రాజీ కుదిర్చి 253 దావాలలో రూ.16.52 కోట్ల బాధితులకు బ్యాంకు ఖాతాల్లో జమ చేశాం.

■ న్యాయసేవాధికార సంస్థకు ప్రజల సహకారం..

■ లోక్ అదాలత్‌లను తెలుగులో ప్రజాన్యాయపీఠాలు అని పిలుస్తాం. ప్రజాసమూహాలు ప్రజాపీఠాలను విజయవంతం చేస్తున్నాయి.

గుజరాత్‌లో ప్రతిభ చూపిన తెయూ వలంటీర్లు

డిచ్‌పల్లి: గుజరాత్ రాష్ట్రం గోద్రాలో ఉన్న కళాశ్రీ గోవింద్ గురు యూనివర్సిటీలో నిర్వహించిన జాతీయ సమైక్య శిబిరంలో తెయూ ఎన్ఎస్ఎస్ వలంటీర్లు తమ ప్రతిభా పాటవాలు ప్రదర్శించారని కో–ఆర్డినేటర్ కె.రవీందర్‌రెడ్డి తెలిపారు. ఈనెల 1 నుంచి 8 వరకు జాతీయ సమైక్య శిబిరం కొనసాగిందని శిబిరంలో తెయూ ఎన్ఎస్ఎస్ వలంటీర్లు బంజారా సంప్రదాయ నృత్యానికి ద్వితీయ బహుమతి లభించిందన్నారు. స్వాగత కార్యక్రమంలో వలంటీర్ కార్తీక్ నాట్య ప్రదర్శన అందరినీ ఆకట్టుకుందన్నారు. అలాగే 'భావి భారతదేశం –యువత పాత్ర, మానవ వనరుల వినియోగం – పర్యావరణం' అంశాలపై వలంటీర్లు ఉపన్యాసాలు ఇచ్చారు. శిబిరంలో పాల్గొనడం వల్ల విద్యార్థుల్లో జాతీయభావం, భారతీయ కళలు, భాష, సంప్రదాయాలపై అవగాహన ఏర్పడిందని ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ సరిత పేర్కొన్నారు. కార్యక్రమంలో గుజరాత్ విద్యాశాఖ మంత్రి కుబేర్ డెండోర్, కళాశ్రీ గోవింద్ గురు యూనివర్సిటీ వైస్–చాన్స్‌లర్ ప్రతాప్ సిన్హా తదితరులు పాల్గొన్నారు.